## బస్సు బోల్తా.. ఇద్దరు చిన్నారులు మృతి

**ఒకరి పరిస్థితి విషమం, 40మందికి గాయాలు**

హైదరాబాద్, మే 23(నమస్తే తెలంగాణ): ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఓ ప్రైవేట్ బస్సు బోల్తాపడిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా, 40 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కోడుమూరు సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి ఓ ప్రైవేట్ బస్సు 40 మందికిపైగా ప్రయాణికులతో ఆదోనికి వెళ్తున్నది. బస్సుడ్రైవర్ కోడుమూరు-ప్యాలకుర్తి మధ్య ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోగా, బస్సు బోల్తాపడింది. బస్సులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు లక్ష్మి(13), గోవర్ధని(8) మృతిచెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. 40 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా, కోడుమూరు, కర్నూలు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు వెల్లడించారు.

## 5 కోట్లు దాటిన తిరుమల భక్తుల సంఖ్య

- **ఈ వారంలో రోజుకు 80వేలకు పైగా దర్శనం**
- **తిరుపతిలో వైభవంగా గోవిందరాజస్వామి రథోత్సవం**
- **స్వర్ణరథంపై ఊరేగిన తిరుచానూరు పద్మావతి అమ్మవారు**

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): గత బుధవారం నుంచి ఈ నెల 22 వరకు తిరుమల శ్రీవారిని సుమారు 5 కోట్ల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారు. వారం రోజులుగా నిత్యం 80 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని టీటీడీ అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో వేసవి సెలవులు, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన కారణంగా ఈ వారం భక్తుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్న భక్తులతో కొండపై ఉన్న అన్ని కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఏటీసీ గెస్ట్‌హౌస్ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. బుధవారం స్వామివారిని 80,048 మంది భక్తులు దర్శించుకోగా 35,403 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ద్వారా రూ.4.17 కోట్ల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

## కోర్టు ధిక్కరణ కేసులో జైలు శిక్ష అమలుపై హైకోర్టు స్టే

**నిర్మల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు ఊరట**

హైదరాబాద్, మే 23, ( నమస్తే తెలంగాణ): ఆరోగ్య కార్యకర్తలకు జీతాలు చెల్లించాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును అమలు చేయని నిర్మల్ జిల్లా కలెక్టర్, నిర్మల్ మున్సిపల్ కమిషనర్లకు విధించిన జైలు శిక్ష అమలును దిసభ్య ధర్మాసనం నిలుపుదల చేసింది. తమ ఉత్తర్వులు 15 రోజుల్లో అమలు చేయని పక్షంలో నిర్మల్ కలెక్టర్‌కు నెల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా, మున్సిపల్ కమిషనర్‌కు 15 రోజుల జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ గతంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య కార్యకర్తలు 47 మందిని కలెక్టర్ ఆధ్వర్యంలో నియామకం జరిగింది. ఆరు నెలలైనా వివిధ కారణాలు చెబుతూ వేతనాలు చెల్లించకపోవడంతో సయ్యద్ షకీరు అహ్మద్ సహా 28 మంది హైకోర్టును ఆశ్రయించారు. 2022 సెప్టెంబరులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడంతో సయ్యద్ షకీర్ అహ్మద్ మరో 27మంది విడివిడిగా రెండు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి, కలెక్టర్, మున్సిపల్ కమిషనరు 15రోజులు గడువు ఇస్తూ మే3న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు అమలు చేయని పక్షంలో వారివురికి జైలు శిక్ష, జరిమానా అమలు అవుతుందని చెప్పారు. సింగిల్ జడ్జి విధించిన శిక్షను సవాలు చేస్తూ నిర్మల్ కలెక్టర్ మహమ్మద్ ముషారఫ్ అలీ ఫరూఖీ అప్పీలు దాఖలు చేశారు. అప్పీలుపై గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి విజయసాయిరెడ్డి, జస్టిస్ ఏ లక్ష్మీనారాయణతో కూడిన డివిజన్ బెంచి పైవిధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును నిలిపివేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

## రీపోలింగ్ పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): ఏపీలో పలు పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ పెట్టాలని మంత్రి అంబటి రాంబాబు వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికలు అయిపోయాక ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. మరోవైపు చంద్రగిరి నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో కూడా రీపోలింగ్ పెట్టాలని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కోర్టులో పిటిషన్ వేశారు. ఈయన పిటిషన్‌ను కూడా హైకోర్టు కొట్టివేసింది.

## ఎంఎన్‌జేలో 100 రోబోటిక్ శస్త్ర చికిత్సలు విజయవంతం

- **పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్లు**
- **పీజీ విద్యార్థులకు రోబోటిక్ సర్జరీలపై శిక్షణ**
- **క్యాన్సర్ దవాఖాన డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్**



హైదరాబాద్ సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): ఎంఎన్‌జే దవాఖానలో పైసా ఖర్చు లేకుడా పేద రోగులకు ఖరీదైన రోబోటిక్ శస్త్రచికిత్సలు చేస్తున్నామని ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. దవాఖానలో 100 రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంఎన్‌జేలో నిరుడు సెప్టెంబర్ నుంచి రోబోటిక్ సర్జరీలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రైవేటులో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల ఖరీదైన రోబోటిక్ సర్జరీలను ఎనిమిది నెలల కాలంలో ఎంఎన్‌జేలో పైసా ఖర్చు లేకుండా పూర్తి ఉచితంగా విజయవంతంగా చేస్తున్నట్టు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శరీర భాగాల్లో ఏర్పడిన క్యాన్సర్ ట్యూమర్‌లను ఈ రోబోటిక్ ద్వారా అతి సులభంగా, సురక్షితంగా తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు. సర్జరీ జరిగిన తరువాత కూడా రోగులకు తదనంతర చికిత్సను ఉచితంగానే అందిస్తున్నట్టు పేర్కొన్నారు. వైద్యవిద్యలో భాగంగా పీజీ అనంతరం సూపర్‌స్పెషాలిటీ కోర్సు చదివే ఎంసీహెచ్ సర్జికల్ అంకాలజి విద్యార్థులకు రోబోటిక్ సర్జరీలపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తున్నట్టు ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



హనుమకొండ జిల్లా కేయూ పరిపాలన భవనం ఎదుట వంట సామగ్రి, ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

## కేయూలో విద్యార్థుల ఆందోళన

- **మెస్ మూయొద్దని డిమాండ్**
- **రిజిస్ట్రార్‌కు దిష్టిబొమ్మ దహనం**

హనుమకొండ చౌరస్తా, మే 23 : కాకతీయ విశ్వవిద్యాలయంలో మెస్‌లను మూసివేస్తామని హాస్టల్ డైరెక్టర్ సర్క్యూలర్ జారీ చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట వంటసామగ్రితో ఆందోళన చేపట్టారు. ప్లేట్లతో రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ పీడీఎస్‌యూ కార్యదర్శి మర్రి మహేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో గ్రూప్స్, డీఎస్సీతోపాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించనున్నారని, ఈ సమయంలో మెస్‌ను ముసివేయడం తగదని అన్నారు. సర్క్యూలర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్ల డైరెక్టర్ సమ్మయ్య స్పందిస్తూ హాస్టళ్లను యథావిధిగా నడిపిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

## ఏపీలో బాలికపై లైంగికదాడి

- **నలుగురు యువకుల అరెస్టు**

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): ఏపీలోని ఏలూరు జిల్లా మండవల్లి మండలంలో అమానవీయ సంఘటన జరిగింది. పదో తరగతి మెమోను తీసుకెళ్లేందుకు పాఠశాలకు వచ్చిన ఓ బాలిక(15)ను సహచర విద్యార్థి(15) తరగతి గదిలోకి లాక్కెళ్లి లైంగికదాడి చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండవల్లి మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక పదోతరగతి మెమో కోసం ఈ నెల 15న పాఠశాలకు వెళ్లింది. ఉపాధ్యాయులు బడిలో లేకపోవడంతో ఇంటికి వెళ్తుండగా, అక్కడే ఉన్న సహ విద్యార్థి .. బాలికను తరగతి గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. ఈ ఘటనను బాలసుబ్రహ్మణ్యం(22), చంద్రశేఖర్ (22), తేజ (19), హరికృష్ణ (20) వీడియో తీశారు. తమ కోరిక తీర్చాలని బాలికను బలవంతం చేశారు. డబ్బులు ఇవ్వాలని బాధితురాలి తల్లిదండ్రులనూ బెదిరించారు. బాలిక తల్లి కైకలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. లైంగికదాడి చేసిన బాలుడిని విజయవాడ జువైనల్ హోమ్‌కు తరలించారు. బాధితురాలిని వేధించిన నలుగురిని కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.


## మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఊరట

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): ఈవీఎంల ధ్వంసం ఘటనలో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పిన్నెల్లి సహా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ముందస్తు బెయిల్ పిటిషన్లమీద తీర్పు వెలువరించింది. జూన్ 5 ఉదయం 10 గంటల వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది.

## ఏపీ పాలిసెట్-2024 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

- **మే 24న ఫీజు చెల్లింపు**
- **27న డాక్యుమెంట్ల పరిశీలన, మే 31 నుంచి కౌన్సిలింగ్**

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ పాలిసెట్ -2024 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఏపీ సాంకేతిక విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ లో పొందుపరిచింది. ర్యాంక్ హోల్డర్లందరికీ ఏపీ పాలిసెట్ ఫీజు చెల్లింపు మే 24 నుంచి, మే 27 నుంచి డాక్యుమెంట్ వెరిఫికేషన్, మే 31నుంచి కళాశాలల ఎంపిక ఉంటుంది. వాటికి సంబంధించిన దరఖాస్తు ఫారం appolycet.nic.inలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ర్యాంక్ హోల్డర్లు ఆన్‌లైన్ మోడ్ ద్వారా మే 24 నుంచి జూన్ 2 మధ్య ప్రాసెసింగ్ ఫీజులను చెల్లించాల్సి ఉంటుంది.



లండన్‌లో లండన్ ఆఫ్ కార్పొరేషన్ సభ్యులతో కమలేశ్ డీ పటేల్

## దాజీకి లండన్ అవార్డు

*నందిగామ, మే 23 : రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని శ్రీ రామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ డీ పటేల్ (దాజీ)కు అరుదైన అవార్డు దక్కింది. ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్ అవార్డును గురువారం ఆయన లండన్‌లో అందుకున్నట్టు రామచంద్రమిషన్ పీఆర్‌వో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, పర్యావరణ వంటి రంగాల్లో దాజీ చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందించారని, దీంతోపాటు కామన్వెల్త్ సెక్రటేరియట్‌తో ప్రత్యేక అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు పేర్కొన్నారు.*

## నిమ్స్‌లో 'గుండె మార్పిడి' విజయవంతం



శస్త్రచికిత్స అనంతరం రోగితో వైద్యులు

ఖైరతాబాద్, మే 23 : గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక రోగికి నిమ్స్ వైద్యులు విజయవంతంగా గుండె మార్పిడి శస్త్రచికిత్స చేశారు. వివరాల్లోకెళ్తే... ములుగు జిల్లా ఏటూరునాగారం మండలానికి చెందిన షేక్ షనాజ్ (29) రెండేండ్లుగా డైలేటెడ్ కార్డియో మయోపతి (గుండె ఎడమ జఠరిక వద్ద సమస్య)తో బాధపడుతున్నది. దీని కారణంగా గుండె పనితీరు మందగించి, శరీరానికి కావాల్సిన రక్తాన్ని పంపింగ్ చేయలేకపోతుంది. ఎన్ని దవాఖానలు తిరిగిన ఫలితం లేకపోవడంతో మూడు నెలల క్రితం ఆమె నిమ్స్ వైద్యులను ఆశ్రయించింది. ఈ మేరకు నిమ్స్ కార్డియోథోరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వర రావు, డాక్టర్ గోపాల్ నేతృత్వంలో రోగికి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ రిపోర్ట్‌ల ప్రకారం రోగికి గుండె మార్పిడి తప్పనిసరి అని వైద్యులు తేల్చారు. ఈ మేరకు రోగి కుటుంబ సభ్యులు నిమ్స్ వైద్యాధికారుల సహకారంతో జీవన్‌దాన్‌లో పేరు నమోదు చేయించుకొని, అవయవదాత కోసం నిరీక్షిస్తున్నారు. అయితే రెండ్రోజుల క్రితం సికింద్రాబాద్ యశోద దవాఖానలో ఓ వ్యక్తి బ్రెయిన్ డెడ్‌కు గురైనట్టు జీవన్‌దాన్ వైద్య బృందం గుర్తించింది. సదరు జీవన్మృతుడి బ్లడ్ గ్రూప్‌తో రోగి షనాజ్ బ్లడ్ గ్రూప్ సరిపోలడంతో గుండె మార్పిడి శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో బుధవారం డాక్టర్ అమరేశ్వర రావు సారథ్యంలో వైద్య బృందం విజయవంతంగా గుండె మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించింది. ప్రైవేటులో రూ.30లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఖర్చయ్యే గుండె మార్పిడి శస్త్రచికిత్సను నిమ్స్ వైద్యులు ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా జరిపినట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. అనంతరం వైద్యసిబ్బందిని అభినందించారు.

## వ్యక్తిని బలిగొన్న మైనర్ బైక్ రైడర్

ముంబై : పుణేలో ఇటీవల ఓ మైనర్ బాలుడు కారుతో బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు మరణించడంపై జనాగ్రహం పెల్లుబికింది. ఈ ఆగ్రహావేశాలు చల్లారక ముందే మరో దారుణం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ముంబైలోని మజ్‌గావ్ ప్రాంతంలో 15 ఏళ్ల మైనర్ బాలుడు గురువారం ఉదయం బైక్‌ను నడిపి, ఇర్ఫాన్ నవాబ్ అలీ షేక్ (32)ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఇర్ఫాన్‌ను దవాఖానకు తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. నిందితుడిని డోంగ్రి చిల్డ్రన్స్ హోంకు తరలించి, అతని తండ్రిని అరెస్ట్ చేశారు.